క్లుప్తంగా

ఎడ్ల బల ప్రదర్శనకు ఏర్పాట్లు

తెనాలి రూరల్: ఈ నెల 29 నుంచి ఏప్రిల్ 4వ తేదీ వరకు తెనాలి మార్కెట్ యార్డు ఆవరణలో జరగనున్న జాతీయ స్థాయి ఎడ్ల బల ప్రదర్శన పోటీల ఏర్పాట్లు ప్రారంభమయ్యాయి. ఆలపాటి శివరామకృష్ణయ్య మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ సారథ్యంలో జరగనున్న ఈ పోటీలకు సంబంధించి గురువారం భూమి పూజ నిర్వహించారు. వేద పండితులు పూజా కార్యక్రమాలు నిర్వహించి పనులను ప్రారంభించారు. టీడీపీ నాయకులు పనులను పర్యవేక్షిస్తున్నారు. టీడీపీ పట్టణ అధ్యక్షుడు తాడిబోయిన హరిప్రసాద్, అర్బన్ బ్యాంక్ చైర్మన్ మంగమూరి హరి ప్రసాద్, మాజీ ఎంపీపీ సూర్యదేవర వెంకట్రావు, రావి చిన్ని, సుంకర హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రోడ్లపై చెత్త కనిపిస్తే చర్యలు

తెనాలి అర్బన్: రోడ్లపై చెత్త కనిపిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న హెచ్చరించారు. చెంచుపేటలో గురువారం ఉదయం ఆయన పర్యటించారు. ఆ ప్రాంతంలో పారిశుద్ధ్య నిర్వహణ పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. రైతుబజార్ వద్ద వ్యర్థాలను కార్మికులకు అప్పగించాలని సూచించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అనంతరం బస్టాండ్ సమీపంలోని అన్న క్యాంటీన్‌కు వెళ్లి అల్పాహారాన్ని పరిశీలించారు. అసిస్టెంట్ కమిషనర్ వీఎం లక్ష్మీపతిరావు చినరావూరులో పర్యటించారు. కొందరు అనధికారికంగా రోడ్లపై నిర్మాణాలు చేయడాన్ని గమనించిన ఆయన వాటిని తొలగించాలని ఆదేశించారు. అధికారుల వెంట పలువురు శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

లబ్ధిదారుల వివరాల తనిఖీపై అవగాహన



తెనాలి రూరల్: జగనన్న కాలనీలలో స్థలాలు పొందిన లబ్ధిదారుల రీ వెరిఫికేషన్ ప్రక్రియ వేగవంతంపై మున్సిపల్ కమిషనర్ బి.శేషన్న, తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణలు వీఆర్వోలతో గురువారం సమీక్ష జరిపారు. స్థానిక పురపాలక సంఘ కార్యాలయం కౌన్సిల్ హాలులో జరిగిన సమావేశంలో ప్రభుత్వం నిర్దేశించిన యాప్‌పై అవగాహన కల్పించారు. పట్టణ పరిధిలో 20 వేలు, రూరల్ పరిధిలో మూడు వేల మంది లబ్ధిదారులకు రీ వెరిఫికేషన్ జరగనుందని చెప్పారు.

మైనర్‌తో వివాహం.. వరుడిపై కేసు

తెనాలి రూరల్: మైనర్‌ను వివాహం చేసుకున్న యువకుడు, అతని కుటుంబసభ్యులపై కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు... పట్టణ మారిస్‌పేటకు చెందిన 16 ఏళ్ల బాలికకు ఈ నెల 2వ తేదీన కుటుంబసభ్యులు వివాహం చేశారు. విషయం ఆలస్యంగా వెలుగులోకి రావడంతో సంబంధిత వార్డు సచివాలయ కార్యదర్శి పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాలికను వివాహం చేసుకున్న యువకుడు, అతడి కుటుంబ సభ్యులపై గురువారం త్రీ టౌన్ ఎస్ఐ షేక్ కరిముల్లా కేసు నమోదు చేశారు.

అన్నపై తమ్ముడు దాడి

తెనాలి రూరల్: స్థల వివాదం నేపథ్యంలో అన్నపై తమ్ముడు దాడి చేసి గాయపర్చడంపై కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు పట్టణానికి చెందిన అన్నదమ్ములు తోట శివానందం, తోట శ్రీనివాసరావుకు స్థలం విషయంలో వివాదం ఉంది. ఈ నేపథ్యంలో శ్రీనివాసరావు తన అన్నపై దాడి చేసి గాయపర్చాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు టూ టౌన్ పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు.

23న రాష్ట్ర మాజీ సైనిక సంక్షేమ సంఘం ఎన్నికలు

మంగళగిరి టౌన్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మొట్టమొదటి సారిగా మాజీ సైనిక సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నికోవడానికి ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు ఏపీ మాజీ సైనిక సంక్షేమ సంఘం రాష్ట్ర హడ్ కమిటీ కో ఆర్డినేటర్ కె. గోవిందరావు తెలిపారు. మంగళగిరి నగర పరిధిలోని మంగళగిరి ప్రెస్‌క్లబ్‌లో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ నెల 23న ఎన్నికలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. మాజీ సైనికుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం కార్పొరేషన్ ఏర్పాటు చేయడం సంతోషించదగ్గ విషయమన్నారు. సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వంతో కలసి పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. 120 సంఘాల మద్దతుతో ఒక రాష్ట్రం ఒకటే అసోసియేషన్ అనే నినాదంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ సైనిక సంక్షేమ సంఘం ఏర్పడిందని అన్నారు. ఈ సంఘం రాష్ట్రంలో వున్న 1.15 లక్షల మంది మాజీ సైనికులు, సైనిక వితంతువుల సమస్యల కోసం పనిచేసేందుకు నూతన కార్యవర్గాన్ని ఎన్నుకుంటున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో మంగళగిరి వెటరన్ ఆర్గనైజేషన్ వైస్ ప్రెసిడెంట్ సాంబశివరావు, జనరల్ సెక్రటరి బాలస్వామి, ట్రెజరర్ సాంబశివరావు పాల్గొన్నారు.

రాష్ట్ర మహిళా సదస్సును జయప్రదం చేయండి

మంగళగిరి టౌన్ : అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 9న ఆదివారం జరిగే రాష్ట్ర మహిళా సదస్సును జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

తెనాలి మున్సిపల్ కార్యాలయంలోని ఇంజినీరింగ్ విభాగంలో కొందరు అధికారులు మొద్దు నిద్ర వీడటం లేదు. ఏఈలు మారినా వ్యవస్థలో మాత్రం మార్పు రావటం లేదు. విధుల్లో చేరిన కొత్తలో హడావిడి చేయటం.. తర్వాత ఆయా అంశాలపై దృష్టి పెట్టకపోవటం పరిపాటిగా మారింది. ఏడాది క్రితం తెనాలి పట్టణంలో జరిగిన అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులు నేటికీ సిద్ధం కాలేదు. బిల్లుల వివరాలు కంప్యూటర్‌లో పొందుపరిచే పని కూడా ఏఈలకు రాకపోవటం గమనార్హం. దీంతో పనులు చేసిన కాంట్రాక్టర్‌లు బిల్లులు తయారు చేయాలని కాళ్లు అరిగేలా అధికారుల చుట్టూ తిరుగుతూ పని జరగక అభివృద్ధి పనులు నిలిపివేస్తున్నారు.



పూర్తయిన తెనాలి బండ్ పనులు

ఏడాదిగా నిద్ర..
బిల్లులకేదీ ముద్ర?

- ఇంజినీరింగ్ విభాగంలో పెండింగ్‌లో పనుల బిల్లులు
- ఏఈలు మారినా 67 పనులకు చెల్లింపులు శూన్యం
- దిక్కుతోచక పనులు నిలిపివేస్తున్న కాంట్రాక్టర్‌లు

తెనాలి అర్బన్: తెనాలి పట్టణంలో 55,917 గృహాలున్నాయి. 2.60 లక్షల మంది జనాభాతో ఉమ్మడి జిల్లాలో అతి పెద్ద పట్టణంగా విస్తరించింది. జిల్లాలోనే ఏకైక సెలక్షన్ గ్రేడ్ మున్సిపాలిటీగా దీనికి పేరుంది. ప్రతి ఏడాది వివిధ పన్నులు, దుకాణాల అద్దెలు తదితరాల ద్వారా రూ.36 కోట్ల ఆదాయం సమకూరుతోంది. ఇవికాకుండా ఆర్థిక సంఘం, ఇతర గ్రాంట్‌ల ద్వారా సుమారు రూ.50 కోట్ల వరకు సమకూరుతుంటాయి.

నిలిచిన బిల్లులు

పట్టణంలో గతేడాది గడప గడపకు మన ప్రభుత్వం పనులు, 14వ, 15వ ఆర్థిక సంఘాలు, జనరల్ ఫండ్ నిధులతో అనేక అభివృద్ధి పనులు జరిగాయి. వాటిలో కొన్నింటిని అధికారులు బిల్లులు రూపొందించి ఆన్‌లైన్‌లో సబ్‌మిట్ చేశారు. మిగిలిన పనులు పూర్తయినా నేటికీ బిల్లులను ఏఈలు రూపొందించలేదు. దీంతో పట్టణంలో 67 అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులు పెండింగ్‌లో



విస్తరించిన బుర్రిపాలెం రోడ్డు

ఉన్నాయి. ఇటీవల జరిగిన మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో కమిషనర్ బండి శేషన్న స్వయంగా ఈ విషయాన్ని ప్రకటించారు. దీనిని బట్టి చూస్తే ఇంజినీరింగ్ అధికారులు ఎంతటి అలసత్వంతో వ్యవహరిస్తున్నారో అర్థమవుతోంది.

బిల్లులు చేసే వారు కరువు

పట్టణంలో జరిగే ప్రతి అభివృద్ధి పనిని ఏఈ, డీఈ, ఎంఈలు పర్యవేక్షిస్తుంటారు. అవసరమైతే కమిషనర్ కూడా పరిశీలిస్తారు. పనులు పూర్తి అయిన వెంటనే ఏఈలు ఎంబుక్ (పనులకు సంబంధించిన వివరాలు) రాస్తారు. దానిని ఉన్నతాధికారులకు పంపుతారు. వారు కూడా ఆమోదిస్తే ఆడిట్ పూర్తి చేసుకుని బిల్లు సీఎంఆర్ఎఫ్‌కు వెళ్తుంది. ప్రభుత్వం నిధులు విడుదల చేసినప్పుడు కాంట్రాక్టర్ బ్యాంక్ అకౌంట్‌లో నగదు జమ అవుతాయి. అయితే పట్టణంలో గతంలో పనిచేసిన ఏఈలకు, ప్రస్తుతం పనిచేస్తున్న ఏఈలకు కంప్యూటర్ ద్వారా బిల్లులు తయారు చేయటం రాదు. ఈ విషయాన్ని కమిషనర్ జరిపిన సమీక్షలో వారే స్వయంగా తెలియజేశారు. దీంతో ఆయన విస్మయం వ్యక్తం చేసి త్వరగా నేర్చుకోవాలని సూచించారు. ప్రస్తుతం అవుట్ సోర్సింగ్‌పై పనిచేస్తున్న కంప్యూటర్ ఆపరేటర్‌లతో బిల్లులు చేయిస్తున్నారు. దీనివల్ల బిల్లుల తయారీలో కొన్ని ఇబ్బందులు రావటం వల్ల అసలులో కొంత నష్టపోవాల్సి వస్తోందని పలువురు కాంట్రాక్టర్‌లు ఆరోపిస్తున్నారు.

పనులు చేసేందుకు వెనుకడుగు

ఇంజినీరింగ్ అధికారుల తీరుతో తెనాలి పట్టణంలో అభివృద్ధి పనులు నిలిచిపోతున్నాయి. పట్టణంలోని వివిధ పనులకు ఈ టెండరింగ్ నిర్వహిస్తున్న వాటిలో పాల్గొనేందుకు ఎవరూ ముందుకు రావటం లేదు. దీంతో అధికారులు కాంట్రాక్టర్‌లతో మాట్లాడి టెండర్లు వేయిస్తున్నారు. వారు అయిష్టంగానైనా టెండర్లు వేసినా.. పనులు చేసేందుకు ముందుకు రావటం లేదు. చేసిన పనులకు బిల్లులను కూడా అధికారులు ఆమోదించకుండా పర్సనల్ చెకింగ్ అని ఫైల్‌పై రాసి రోజుల తరబడి పనిని తనిఖీ చేయకుండా పెండింగ్‌లో పెడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇటీవల ఈ తరహావి ఎక్కువగా వినిపిస్తున్నాయి. అలాగే తెనాలిలో గతంలో పనిచేసిన మున్సిపల్ ఇంజినీర్ బదిలీపై వెళ్లారు. అప్పటి నుంచి డీఈ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. 8 నెలలు కావస్తున్నా నేటికీ ఎంఈకి సంబంధించిన వేలిముద్ర ఉన్నతాధికారుల నుంచి రాలేదని తెలిసింది. దీనివల్ల బిల్లులు ఎంఈ వరకు వెళ్లి అక్కడ వేలిముద్ర లేక ఫైల్ పెండింగ్‌లో పడుతోందనే ఆరోపణ వినిపిస్తోంది. ఇప్పటికైనా మున్సిపల్ ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

మార్పులు తెస్తున్నాం



పట్టణంలో జరిగిన పలు అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులు పెండింగ్‌లో ఉన్న మాట వాస్తవం. వాటిని త్వరగా రూపొందించి ఆమోదించాలని ఏఈలు, డీఈలకు సూచించాం. కొన్ని బిల్లులను కూడా ఇటీవల ఆమోదించాం. ఇంజినీరింగ్ విభాగంలో కొన్ని సమస్యలు ఉన్నాయి. వాటిని అధిగమించేలా మార్పులు చేస్తూ తగిన చర్యలు తీసుకుంటున్నాం.

– బండి శేషన్న, కమిషనర్, తెనాలి పురపాలక సంఘం

జనార్దన స్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం



కొల్లిపర: మండల కేంద్రమైన కొల్లిపర గ్రామంలో వేంచేసి యున్న శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ జనార్దనస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు గురువారం వైభవంగా ప్రారంభం అయ్యాయి. ఆలయ కమిటీ సభ్యులు, ఈవో అవుతు శ్రీనివాసరెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు. భక్తులు వేల సంఖ్యలో పాల్గొన్నారు. స్వామి వారిని వివిధ రకాల పూలతో, పట్టు వస్త్రాలతో ప్రత్యేకంగా అలంకరించారు. పూజలు, అభిషేకాలు నిర్వహించారు. స్వామి వారిని పెండ్లి కుమారుడిగా అలంకరించి గజ వాహనంపై పురవీధుల్లో ఊరేంగించారు. పండితులు జగన్నాథాచార్యులు, పోగుల రామ లింగేశ్వరశర్మ , యోగానంద పృథ్వీభార్గవ్, వీరభద్రేశ్వర కోటేశ్వరశర్మ, సీతారామాచార్యులు, నాగరాజుశర్మలు పాల్గొన్నారు. సాయంత్రం ఆలయ ప్రాగణంలో శ్రీవాసవీ కన్యకా కోలాట భజన సమాజం వారిచే నిర్వహించిన కోలాట ప్రదర్శన ఆకట్టుకుంది.

నేడు తెనాలిలో మహిళా దినోత్సవం

తెనాలి రూరల్: తెనాలి ఎంపీడీవో కార్యాలయంలో మహిళా దినోత్సవం కార్యక్రమాలు శుక్రవారం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో అత్తోట దీప్తి గురువారం తెలిపారు. సబ్ కలెక్టర్ సంజనా సింహ ముఖ్య అతిథిగా పాల్గొంటారని చెప్పారు. స్వయం సహాయక సంఘాలకు ఉపాధి కల్పించేందుకు వారు తయారు చేనేత ఉత్పత్తుల ప్రదర్శన ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు.

నేటి నుంచి శిఖర ప్రతిష్ట ఉత్సవాలు

తెనాలి: స్థానిక నెహ్రూరోడ్డులోని శ్రీరుక్మిణీ సత్యభామ సమేత శ్రీగోవర్ధన స్వామి, వీరప్రతాప ఆంజనేయస్వామి దేవస్థానంలో ఈ నెల 9వ తేదీన జీవధ్వజ శిఖర ప్రతిష్ట, మహా కుంభాభిషేక ఉత్సవం జరగనుంది. ఆలయ వంశపారంపర్య అర్చకులు టి.రఘు, వేదాంత మాధవ్‌కుమార్‌లు ఆలయ ప్రాంగణంలో గురువారం ఆహ్వానపత్రికను ఆవిష్కరించారు. అనంతరం వివరాలను తెలిపారు. ప్రాచీన కాలానికి చెందిన ఈ దేవాలయానికి 15వ శతాబ్దంలో శ్రీకృష్ణదేవరాయలు సందర్శించారని, సంబంధిత శాసనం ఆలయ ప్రాంగణంలోనే ఉన్నట్టు అర్చకులు గుర్తుచేశారు. భక్తుల సహకారంతో స్వామివారి ముఖమండప పునర్నిర్మాణం పూర్తి చేసినట్టు తెలిపారు. 7వ తేదీన అంకురార్పణతో మొదలు

8న ఉదయం అగ్ని ప్రతిష్ఠాపన కుంభారాధన, శ్రీగోవర్ధనస్వామి, రాజ్యలక్ష్మి, గోదాదేవి అమ్మవార్లకు కలశ స్నపన, హోమాలు తదితరాలు జరుగుతాయని చెప్పారు. 9వ తేదీ ఉదయం 10.54 గంటలకు జీవధ్వజ శిఖర ప్రతిష్ట, విమాన గోపురాలకు మహాకుంభాభిషేకాలు ఉంటాయని వివరించారు. 10వ తేదీ ఉదయం స్వామివారి శాంతి కళ్యాణం, అన్నప్రసాద వితరణ ఉంటాయని తెలిపారు. ఆహ్వానపత్రిక ఆవిష్కరణలో ఆలయ వంశపారంపర్య ధర్మకర్తల కుటుంబసభ్యులు భాగవతుల నిఖిల్ శాండిల్య, వంశపారంపర్య అర్చకులు టి.అనంతాచార్యులు, వేదాంతం కేశవమూర్తి, టి.యశ్వంత్, ఆలయ సిబ్బంది బి.సుబ్బారావు పాల్గొన్నారు.



ఆహ్వానపత్రిక ఆవిష్కరిస్తున్న దృశ్యం

నేడు మధుర కవి నూతక్కి జయంతి వేడుకలు

తెనాలి టౌన్: మధుర కవి, కావ్య కళానిధి నూతక్కి అబ్రహం జయంతి సభను శుక్రవారం రూరల్ గ్రామం కొలకలూరు బాబు జగ్జీవన్ రామ్ కమ్యూనిటీ హాలులో నిర్వహించనున్నట్లు ఆది జాంబవ దళిత ఉద్యోగుల సేవా సమితి కార్యదర్శి ఉన్నం యెహేస్కేల్ గురువారం తెలిపారు. దీనికి సంబంధించిన పోస్టర్‌ను దళిత ఉద్యోగుల సేవా సమితి సభ్యులు ఆవిష్కరించారు. డాక్టర్ పి.జోసఫ్ రత్నాకర్ అధ్యక్షతన జరిగే కార్యక్రమంలో ముఖ్యవక్తగా విశ్రాంత తెలుగు అధ్యాపకులు డాక్టర్ భూసురపల్లి వెంకటేశ్వర్లు, గౌరవ అతిథులుగా ప్రముఖ రంగ స్థల నటులు పులి పుష్పరాజు, అక్షరజ్యోతి కాన్వెంట్ కరస్పాండెంట్ బీవీఆర్ శర్మ, ప్రముఖ కవి డాక్టర్ నూతక్కి పూర్ణ ప్రజ్ఞాచారి పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు. కరపత్రం ఆవిష్కరణ కార్యక్రమంలో యడ్లపల్లి రవికిరణ్; సుద్దపల్లి మురళీధర్, మోదుకూరి గురుదేవ్, కొలకలూరి పాపారావు, ఉన్నం జాన్‌బాబు, పలువురు సభ్యులు పాల్గొన్నారు.



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న సభ్యులు

కుక్క దాడిలో బాలికకు గాయాలు

మంగళగిరి టౌన్ : మంగళగిరి పట్టణ పరిధిలోని రత్నాల చెరువులోని చెందిన ఆరేళ్ల బాలికపై గురువారం కుక్కదాడి చేసి, గాయపరిచింది. రత్నాల చెరువు దగ్గర నివాసముంటున్న వంకల సతీష్ కుమార్తె భవాని ఆడుకోవడానికి బయటకు వచ్చింది. అప్పుడే కుక్క అకస్మాత్తుగా బాలికపై దాడి చేసింది. స్థానిక మహిళలు కేకలు వేయడంతో పాపను వదిలివేసి కుక్క పారిపోయింది. గాయపడిన పాపను ఆసుపత్రికి తరలించి, చికిత్స అందించారు. రత్నాల చెరువు ప్రాంతమే కాకుండా మంగళగిరి నగర పరిధిలో ప్రతి వీధిలో కుక్కల సంచారం ఎక్కువగా ఉందని, ప్రతిరోజు కుక్కకాటు బారిన పడిన వాళ్లు పదుల సంఖ్యలో ఆసుపత్రుల పాలతున్నారని స్థానికులు చెబుతున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి ప్రజల ప్రాణాలను కాపాడాలని కోరుకుంటున్నారు.



బాలికపై దాడిచేస్తున్న శునకం

డ్రోన్ తనిఖీలు

తాడేపల్లిరూరల్ : గుంటూరు జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా పోలీసులు డ్రోన్ సహాయంతో అసాంఘిక కార్యకలాపాలపై దృష్టి పెట్టారు. ఇందులో భాగంగా తాడేపల్లి పరిధిలోని వివిధ ప్రాంతాల్లో డ్రోన్ ఎగుర వేశారు. కృష్ణానది పరివాహక ప్రాంతంలో ఇసుక తిన్నెల్లో ఏకాంతంగా మాట్లాడుకుంటున్న ప్రేమికులను గుర్తించారు. వెంటనే ఘటనా స్థలానికి తాడేపల్లి సీఐ కల్యాణరాజు తన సిబ్బందితో చేరుకుని, తమదైన శైలిలో ప్రేమ జంటకు కౌన్సిలింగ్ నిర్వహించి అక్కడి నుండి పంపించి వేశారు. ఈ సందర్భంగా సీఐ కల్యాణరాజు మాట్లాడుతూ తాడేపల్లి ప్రాంతంలో అసాంఘిక కార్యకలాపాలపై దృష్టి పెట్టామన్నారు. బహిరంగంగా మద్యం, గంజాయి సేవించడం, పేకాట, ఈవ్‌టీజింగ్, చైన్ స్నాచింగ్ నేరాలను ఛేదించేందుకు పోలీస్ యంత్రాంగం డ్రోన్లు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. నదీ పరివాహక ప్రాంతంతో పాటు పలు ప్రాంతాల్లోని పాడుబడిన బంగ్లాలు, నివాస గృహాలపై కూడా డ్రోన్ కెమెరాల సాయంతో నిఘా ఉంటుందని తెలిపారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు ఎవరైనా పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

మంగళగిరి: నగర పరిధిలోని బహిరంగ ప్రదేశాలు, సీఆర్డీఏ భూముల్లో అసాంఘిక కార్యక్రమాలపై స్థానిక పోలీసులు దృష్టి సారించారు. డ్రోన్‌లు వినియోగించి అడ్డుకట్టవేస్తున్నారు. రూరల్ సీఐ వై.శ్రీనివాసరావు మాట్లాడుతూ మామూలుగా నిఘా ఏర్పాటు చేసి, అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్న ప్రదేశాలకు వెళ్లేసరికి సమాచారం అందుకుని పారిపోతున్నారని తెలిపారు. పోలీసులు వస్తారని అసాంఘిక శక్తులు సైతం నిఘా ఏర్పాటు చేసుకుంటున్నట్లు తెలిపారు.



డ్రోన్ ద్వారా ఇసుక తిన్నెల్లోని జంటను గుర్తించి కౌన్సెలింగ్ ఇస్తున్న తాడేపల్లి సీఐ కల్యాణ్‌రాజు

ప్రేక్షకుల మదిలో సుస్థిర స్థానం

- అలనాటి నటి కాంచనమాల ప్రత్యేకత
- నేడు కాంచనమాల మోనోగ్రాఫ్ ఆవిష్కరణ


తెనాలి: తెలుగు సినిమా చరిత్రలో సువర్ణ అధ్యాయాన్ని లిఖించిన కాంచనమాలకు సంబంధించి వెలుగుచూసిన విశేషాంశాలు, అపురూప చిత్రాలతో రూపొందించిన 'తెలుగు సినిమా డ్రీమ్ గర్ల్ కాంచనమాల' మోనోగ్రాఫ్ పుస్తకాన్ని శుక్రవారం తెనాలిలో ఆవిష్కరించనున్నారు. గుంటూరుకు చెందిన చరిత్ర పరిశోధకుడు, రచయిత పారా అశోక్‌కుమార్ సంపాదకత్వంలో తీసుకొచ్చిన ఈ పుస్తకాన్ని భారత సాంస్కృతిక సహకార స్నేహ సంఘం (ఇస్కఫ్) ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని కార్యాలయంలో సాయంత్రం 4 గంటలకు డాక్టర్ పాటిబండ్ల దక్షిణామూర్తి ఆవిష్కరిస్తారు. ఆచార్య గుజ్జర్లమూడి కృపాచారి, డాక్టర్ రావిపాటి వీరనారాయణ, పుస్తక సంపాదకుడు పారా అశోక్‌కుమార్ పాల్గొంటారు.



పారా అశోక్‌కుమార్

మాతృభాషంటే మక్కువ

కాంచనమాలకు మాతృభాషంటే తరగని అభిమానం. అందుకే బాలీవుడ్ ఆహ్వానించినా అంగీకరించలేదు. పౌరాణికాల నుంచి తెలుగు సినిమాను సాంఘికాల బాట పట్టించారు. సినిమా పరిశ్రమలో స్త్రీలపై చులకనతో అధికారాన్ని చలాయించేవారినీ సహించలేదు. సినిమా కెరీర్‌కు ఇబ్బంది అని తెలిసినా లెక్కచేయక మొండిగా ఎదురుతిరిగారు. ఆ రోజుల్లోనే స్త్రీవాద శక్తిగా నిలిచారు. తెలుగు సినిమా తొలి సూపర్‌స్టార్‌గా కీర్తిని పొందిన అందాల తార కాంచనమాల ప్రత్యేకతలివి. ఆంధ్రాపారిస్ తెనాలి కాంచనమాల స్వస్థలం. 1917లో మార్చి 5న ఆమె జన్మించారు. తండ్రి దాసరి నారాయణదాసు వాయిద్యకారుడు కావటంతో బాల్యంలోనే సంగీతజ్ఞానం అలవడింది. భారత, భాగవతాలను చదివారు. ఆధ్యాత్మిక రామాయణ కీర్తనలను, త్యాగరాయ కృతులను చక్కగా పాడేవారు. తెనాలిలో శ్రీరామవిలాస సభ నాటకాలను చూసి ప్రభావితురాలయ్యారు. నాటకాల్లో స్త్రీ పాత్రలను పురుషులే పోషించే రోజుల్లో తొలిసారిగా స్త్రీ పాత్రతో నటించారు కాంచనమాల. ఆమె రంగస్థల ప్రవేశం అప్పట్లో పెద్ద సంచలనం. ఆ క్రమంలో 1935లో అరోరా వారి 'శ్రీకృష్ణతులాభారం' సినిమాలో చెలికత్తె పాత్రతో తొలిగా వెండితెరపై కనిపించారు. తర్వాత వీరాభిమాన్యులో ఉత్తరగా, విప్రనారాయణ సినిమాలో దేవదేవిగా అవకాశాలొచ్చాయి. 1938లో వచ్చిన రోహిణీ వారి గృహలక్ష్మి సినిమాలో కన్నాంబ, నాగయ్యతో సమవుజ్జీగా కాంచనమాల నటించి గుర్తింపును పొందింది. 'నిజం చెప్పాలంటే ఆ ముక్కోణపు ప్రేమకథలో ఇ ఇద్దరి కంటే మించి నటించింది' అని ప్రసిద్ధ సంపాదకుడు ఏఎస్ రామన్ ప్రశంసించారు. కాంచనమాలను ఆయన 'దక్షిణాది దేవికారాణి' అన్నారు. తెలుగు సినిమా పితామహుడు హెచ్ఎం రెడ్డి తీసిన గృహలక్ష్మి సినిమాలో వేశ్య పాత్రలో నటించిన కాంచనమాల, తన ప్రతిభతో తెలుగు సినిమా చరిత్రలో స్థిరమైన స్థానం సంపాదించారు.



కాంచనమాల మోనోగ్రాఫ్ పుస్తకం



'మాలపిల్ల'లో కాంచనమాల

భారీ పారితోషికం

1938లో గూడవల్లి రామబ్రహ్మం తీసిన తొలి సాంఘిక సినిమా 'మాలపిల్ల'లోనూ కాంచనమాలే కథానాయకి. అందులోని స్టిల్‌తో ముద్రించిన ఆమె క్యాలెండర్ అప్పట్లో చాలామంది ఇళ్లలో ఉండేదట! ఆ ఏడాది 11 సినిమాలు విడుదలైతే వాటిల్లో మాలపిల్ల, గృహలక్ష్మి మాత్రమే సాంఘికాలు. ఈ రెండు సినిమాలు అఖండ విజయాన్ని సాధించాయి. రెండింటిలోనూ కాంచనమాల సౌందర్యం ప్రేక్షకుల్ని మంత్రముగ్ధుల్ని చేసింది. తర్వాత బీఎన్ రెడ్డి తీసిన వందేమాతరంతోపాటు 1939లో మళ్లీపెళ్లి, ఇల్లాలు సినిమాలు చేశారు కాంచనమాల. భారీ వ్యయంతో తీసిన ఇల్లాలు సినిమాకు నాలుగు నెలల కాల్షీట్ల కోసం రూ.12 వేల భారీ పారితోషికం ఇచ్చారు. అప్పట్లో ధాన్యం బస్తా ధర రూ.3 ఉండేదట! తర్వాత మైరావణ, అపవాదు చిత్రాల్లో చేశాక, జెమినీ వాసన్ 1942లో తీసిన జానపద సినిమా బాలనాగమ్మలో కాంచనమాల నటించారు. అది బాక్సాఫీసు రికార్డులను బద్దలుకొట్టింది. పదేళ్ల కాలంలో ఆమె నటించింది కేవలం 11 సినిమాలే అయినా, ఎనలేని కీర్తిని ఆర్జించారు. ఆంధ్ర ప్రేక్షకుల్లో 'అందాల పాలవెల్లి'గా నిలిచారు. ఆమె పేరు తెలియని, స్మరించని ఆంధ్రులు ఆరోజుల్లో లేరంటే అతిశయోక్తికాదు.

అలా సినిమాలకు దూరమై..

తారాపథంలో ఎవరికీ అందనంత ఎత్తుకు ఎదిగిన కాంచనమాల జీవితం, ఆ సినిమాతోనే రంగుల వలలో చిక్కుకుంది. జెమినీ వాసన్ సంస్థతో కుదుర్చుకున్న ఒప్పందంతో ఇతర చిత్రాల్లో నటించేందుకు అవకాశం లేకుండా పోయింది. ఎవరి కుట్రో తెలియదుగానీ, ఆ సంస్థ సినిమాల్లోనూ కాంచనమాలకు చోటు దక్కలేదు. దీంతో ఆమె కళాహృదయం తల్లడిల్లింది. ఆమె సహచరుడు మరణించటంతో మరింతగా కుంగిపోయారు. మానసికంగా బాధపడుతూ చెల్లెలు సంరక్షణలో చాలాకాలం అజ్ఞాతజీవితం గడిపారు. 1946–48లో కొంతమంది మిత్రులు ఆమెను సినిమాల్లో నటింపజేయాలని చూసినా ఆ ప్రయత్నం ఫలించలేదు. ఆమె స్నేహితురాలు, నిర్మాత లక్ష్మీరాజ్యం 1963లో తీసిన నర్తనశాల సినిమాలో చిన్న పాత్రలో నటింపజేశారు. అదే ఆమె ఆఖరి చిత్రం. తెనాలిలో 1940లో ముచ్చటపడి నిర్మించుకున్న ఇంట్లో ఉంటూ అనారోగ్యం నుంచి కోలుకోవటానికి ప్రయత్నించినా సాధ్యపడలేదు. 1981లో ఆమె శాశ్వతంగా దూరమయ్యారు. తెలుగు సినిమా చరిత్రలో మధురమైన జ్ఞాపకంగా మిగిలిపోయారు.

అశ్వవాహనంపై స్వామివారి ఊరేగింపు

తెనాలి టౌన్: బాలాజీరావుపేట అయ్యప్పపురం ప్రధాన అయ్యప్ప దేవాలయంలో శ్రీదేవి భూదేవి సమేత కళ్యాణ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు కనులపండువగా నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో భాగంగా గురువారం సాయంత్రం స్వామివారిని అశ్వ వాహనంపై సుందరంగా అలంకరించారు. అనంతరం ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో దుర్బ హరి బాబు స్వామి, భక్తులు పాల్గొన్నారు.



నేటి నుంచి ఆలయ వార్షికోత్సవాలు

దుగ్గిరాల: శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయం ద్వితీయ వార్షికోత్సవాలు శుక్రవారం నుంచి ప్రారంభంకానున్నాయి. స్థానిక పసుపు మార్కెట్ యార్డు సమీపంలో ఉన్న దేవస్థానంలో ఈ నెల 11వ తేదీ వరకు ఉత్సవాలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. మొదటి రోజు సుప్రభాత సేవ, ధ్వజారోహణ, నిత్య కైంకర్యాలు, గోపూజ, నిత్య హోమం నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. 10న స్వామివారి గ్రామోత్సవం, 11న చక్రస్నానం, నిత్య హోమం జరుగుతుందని, మధ్యాహ్నం అన్నదానం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సాయంత్రం ధ్వజారోహణం, పవలింపు సేవలతో ఉత్సవాలు ముగుస్తాయని పేర్కొన్నారు.

93వ రోజు కార్మికుల దీక్ష

తాడేపల్లిరూరల్ : బ్రహ్మనందపురంలోని ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు నిర్వహిస్తున్న దీక్ష గురువారానికి 93వ రోజుకు చేరింది. సీఐటీయూ నాయకులు దీక్షా శిబిరాన్ని సందర్శించి, కార్మికులకు మద్దతు తెలిపారు. ఎన్నికల ముందు మంత్రి నారా లోకేష్ కార్మికులకు ఇచ్చిన హామీని నెరవేర్చాలని డిమాండ్ చేశారు. యాజమాన్యంను ఒప్పించి కార్మికుల బకాయిలను వెంటనే చెల్లించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
90102 23706 (తెనాలి, వేమూరు, రేపల్లె)
99122 25447 (తెనాలి)
Office mail : sakshigntadvt@gmail.com